

సాంగ్లీ వైపు పసుపు..
మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో పసుపు ధర ఆశాజనకంగా ఉంది. రైతులు అక్కడికే పంటను తరలించి విక్రయిస్తున్నారు.
- 8లో ▸



ప్రమాదాల్లో నలుగురు మృతి
వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. ఇద్దరు రోడ్డు ప్రమాదంలో, ఒకరు సంపులో, మరొకరు చెరువులో మునిగి చనిపోయారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /16.8

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వ్యాపారులు తీరు మార్చుకోవాలి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: పంట చేతికి రాకముందు ఉన్న ధరలను.. మార్కెట్‌లోకి తెచ్చిన తర్వాత తగ్గించి పసుపు, ఎర్రజొన్న రైతులను సిండికేట్ వ్యాపారులు నిండా ముంచుతున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ నాయకుడు అన్వేష్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పసుపు కొనుగోళ్లలో బయటి వ్యాపారులు రాకుండా ఇక్కడి వ్యాపారులే సిండికేట్‌గా ఏర్పడి క్వింటాలు రూ. 13,500 నుంచి రూ. 15వేలు ఉండే ధరను కేవలం రూ. 10 వేలలోపు వచ్చేలా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే పసుపు మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.15 వేలు ధర పలుకుతోందన్నారు. ఎర్రజొన్న వ్యాపారులు క్వింటాలుకు రూ. 4,500 ఉన్న ధరను రూ. 3,700లకు తగ్గించి రైతులను నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. మొక్కజొన్న సాగు పెరిగి, ఎర్రజొన్న సాగు తగ్గినా ధర మాత్రం పెరగలేదని పేర్కొన్నారు. రైతులు తొందరపడి దళారులకు విక్రయించొద్దని కోరారు. వ్యాపారాలు పద్ధతి మార్చుకోకపోతే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిణి ఎస్‌కే రసూల్ బీ



బోధన్ : ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యతని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ కే రసూల్‌బీ అన్నారు. 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం పదేళ్లు పూర్తికావడంతోపాటు జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బోధన్ మండల కల్దుర్కి జడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ బీ మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ పిల్లలకు సమాన హక్కులున్నాయని తెలిపారు. ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు సీడీపీవో పద్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, ఆడపిల్లలపై అఘాయిత్యాల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలతో జరిగే నష్టాలపై డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న షార్ట్‌ఫిలిం ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, షీటీం ఇన్‌చార్జి, ఏఎస్సై రేణుకాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి, స్పెషలిస్టు ఇన్ ఫైనాన్స్ లిటరసీ పుష్ప, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విజయవాడ బస్సుల్లో రాయితీ

- టీజీఎస్ ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న

ఖలీల్ వాడి: విజయవాడ వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో నడిచే రాజధాని బస్సులో 8 శాతం, లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్‌లో బెర్త్ కోసం 4 శాతం, లహరి నాన్ ఏ/సీ సీటర్ కమ్ స్లీపర్, సూపర్ లగ్జరీ బస్సుల్లో బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం తగ్గింపునిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ ఆఫర్‌ను వినియోగించుకొని తగ్గింపు టికెట్ చార్జీతో సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. రాయితీ సౌకర్యం హైదరాబాద్ నుంచి విజయవాడ రూట్‌లో తిరిగే టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనే ఉంటుందని తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్'
నిజామాబాద్ రీజియన్ పరిధిలో 'డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను తెలపాలన్నారు. నిజామాబాద్ ఆర్‌ఎం – 99592 26011, ఆర్మూర్ డీఎం 99592 26019, బోధన్ డీఎం 99592 26001, నిజామాబాద్-1 డీఎం 99592 26016, నిజామాబాద్-2 డీఎం 99592 26017 నంబర్లకు కాల్ చేయాలని కోరారు.



ఖండ్‌గావ్ వద్ద టిప్పర్లలో ఇసుక నింపుతున్న లోడింగ్ వాహనాలు

ఓవర్ లోడ్



ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్

మంజీర పరీవాహకంలో ఇసుక తవ్వకాలు నిబంధనలు అతిక్రమించి సాగుతున్నాయి. ఒక్కో టిప్పర్‌లో 15 టన్నుల ఇసుక లోడ్ వేయాల్సి ఉండగా, ఏకంగా 21 టన్నులు లోడ్ వేసుకుని వెళ్తున్నారు. టిప్పర్లకు ముందు ఎస్కార్ట్ మాదిరిగా ఓ కారు వెళుతుంది. ఎక్కడైనా అధికారుల తనిఖీలు ఉంటే కారులో వెళ్లే వారు టిప్పర్ డ్రైవర్లకు సమాచారమిస్తారు. ఇసుక ర్యాంప్‌ల వద్ద దుమ్ము కారణంగా పంటలు పాడైపోతున్నాయి.

- మంజీర పరీవాహకంలో విచ్చల విడిగా ఇసుక రవాణా.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- పరిమితికి మించి టిప్పర్ల ద్వారా తరలింపు
- భారీగా దెబ్బతింటున్న రోడ్లు
- స్థానిక అభివృద్ధి పనుల కోసం అనుమతులిస్తే ఇతర జిల్లాలకు ఇసుక తోలకాలు
- రవాణా శాఖ చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తేనే అడ్డుకట్ట

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బోధన్ డివిజన్ మంజీర పరీవాహకంలోని ఇసుక తవ్వకాలలో పరిమితులు అతిక్రమించి, నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తున్నారు. బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, బోధన్, రెంజల్ మండలాల్లో అభివృద్ధి పనుల కోసం అవసరమైన ఇసుక తరలించేందుకు ప్రభుత్వం బోధన్‌లోని ఖండ్‌గావ్, సిద్ధాపూర్ గ్రామాల వద్ద మంజీర నదిలో ఇసుక తవ్వేందుకు అనుమతులు ఇచ్చింది. వివిధ రకాల ప్రభుత్వ అభివృద్ధి పనులతోపాటు ఈ మండలాల్లోని ప్రైవేటు పనులకు సైతం ఇక్కడి నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు రెవెన్యూ శాఖ వెసులుబాటు కల్పించింది. అయితే ఇసుక తోలకందార్లు అన్ని నిబంధనలను ఉల్లంఘిస్తూ, ఓవర్ లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో టిప్పర్‌కు 15 టన్నులు (10 క్యూబిక్‌మీటర్లు) లోడ్ వేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఏకంగా 21 టన్నులు (14 క్యూబిక్ మీటర్లు) లోడ్ వేసుకుని టిప్పర్లు వెళుతున్నాయి. రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ల బాడీని ఎత్తుకు కట్టిస్తున్నారు. వీటిని తొలగించాల్సిన బాధ్యత రవాణా శాఖ అధికారులదే. రవాణా అధికారులు పట్టించుకోకపోవడంతో టిప్పర్లలో ఓవర్ లోడ్ భారీగా వేసి ఇసుక రవాణా చేస్తున్నారు. ఇలా వెళ్లే వాటిలో 10 టిప్పర్లకు ఒక కారు చొప్పున ముందుగా వెళుతుంది. తనిఖీ అధికారులు ఉంటే ఫోన్ ద్వారా టిప్పర్ డ్రైవర్లకు సమాచారమిస్తారు. లేకుంటే ఎస్కార్ట్ మాదిరిగా సాఫీగా వెళుతున్నారు.

బోధన్ నియోజకవర్గంలోని పనులు, అవసరాల కోసం కేటాయించిన ఖండ్‌గావ్ ఇసుక పాయింట్ నుంచి ఇసుకను నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ లాంటి ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఓవర్ లోడ్ వేసుకుని మరీ రవాణా చేస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మరోవైపు ఈ భారీ లోడ్ టిప్పర్ల కారణంగా రోడ్లు బాగా దెబ్బతింటున్నాయి. రోడ్డు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అదేవిధంగా ఇసుక ర్యాంప్ నిర్వహిస్తున్న మంజీర పరీవాహకంలో దుమ్ము కారణంగా పంటలు సైతం పాడైపోతున్నాయి. ఖండ్‌గావ్ గ్రామం వద్దే రవాణా శాఖ చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే ఇసుక ఓవర్ లోడ్ వ్యవహారాన్ని అరికట్టే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండానూ చూడవచ్చు. ఈ విషయమై బోధన్ తహసీల్దార్ విఠల్‌ను వివరణ కోరగా స్థానికంగా మూడు మండలాల్లో అవసరాల నిమిత్తమే ఈ ఇసుక ర్యాంప్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. టిప్పర్‌కు 10 క్యూబిక్ మీటర్లు, ట్రాక్టర్‌కు 3 క్యూబిక్ మీటర్లకు మాత్రమే లోడ్ చేసేందుకు అనుమతి ఉందన్నారు. ఓవర్ లోడ్, ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా విషయమై రవాణా శాఖ వారు దృష్టి పెట్టాల్సి ఉందన్నారు.





ఖండ్‌గావ్ వద్ద మంజీరలో ఇసుక ర్యాంప్, వరుస కట్టిన టిప్పర్లు

పందుల కోసం వెళ్తే.. మృత్యుఒడికి

జీవనాధారమైన పందులే..ఆ నిరుపేద కుటుంబాన్ని అనాథను చేశాయి. పందులను పట్టుకునేందుకు వెళ్లిన వారిని కరెంటు కాటేసింది. ఒకరిని కాపాడబోయి మరొకరు.. తల్లిదండ్రులతో పాటు తోబుట్టువు మృత్యుఒడిలోకి చేరుకున్నాడు. కళ్లెదుటే ప్రాణాలు పోతున్నా కాపాడలేకపోయామంటూ కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు.



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

- విద్యుదాఘాతానికి ముగ్గురి బలి
- ఒకరిని కాపాడబోయి మరొకరు..
- మృతులందరిదీ ఒకే కుటుంబం
- ప్రాణాలతో బయటపడ్డ మరో ఇద్దరు కుటుంబ సభ్యులు
- సాటాపూర్‌లో నెలకొన్న విషాదం

రెంజల్(బోధన్) : విద్యుదాఘాతంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన తీవ్ర కలకలం రేపింది. రెంజల్ మండలం సాటాపూర్‌లో విషాదం నింపింది.

పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఓర్సు గంగారాం(50)కు ఇద్దరు భార్యలు, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఒకే ఇంట్లో ఉండే వీరందరూ వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ అనుబంధంగా పందుల పెంపకం చేస్తుంటారు. ఇటీవల పెగడపల్లి, చిన్న మావంది గ్రామాల శివారులోని పంటపొలాల్లోకి పందులు వస్తున్నాయని రైతులు చెప్పారు. దీంతో వాటిని పట్టుకునేందుకు గురువారం తెల్లవారు జామున ఓర్సు గంగారాం, మొదటి భార్య ఓర్సు బాలమణి (45), కొడుకు ఓర్సు కిషన్ (22) మిగతా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. పట్టుకునే క్రమంలో కొన్ని పందులు పంటపొలాల్లోకి చొరబడ్డాయి. వాటి వెనకాలే వెళ్లిన గంగారాం, బాలమణి, కిషన్ పొలంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే కుప్పకూలారు. ప్రమాదాన్ని గమనించిన మిగతా కుటుంబసభ్యులు ఎక్కడికక్కడ నిలబడటంతో ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ విజయ్ బాబు, వెంకట నారాయణ, ఎస్సై మచ్చేందర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులే స్వయంగా స్థానికులతో కలిసి మృతదేహాలను బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. కాగా, ముగ్గురి మృతికి ట్రాన్స్‌కో నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడటంతో పందులను పట్టుకునే క్రమంలో తగిలి మొదట కిషన్ మృతిచెందగా, విద్యుత్ తీగలు పొలంలో పడటంతో తల్లిదండ్రులు సైతం విద్యుదాఘాతంతో మరణించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.



గంగారాం (ఫైల్)



బాలమణి (ఫైల్)



కిషన్ (ఫైల్)

పెద్ద దిక్కును కోల్పోయి..

పందుల పెంపకంతో పాటు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవించే పేద కుటుంబం అనాథగా మారింది. విద్యుదాఘాతంతో గంగారాం, బాలమణి, కిషన్ మరణించగా మొదటి భార్య కుమారుడు ప్రవీణ్, కూతురు యశోద, రెండో భార్య శీల, పిల్లలు కృష్ణ, ప్రేమలత ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ముగ్గురినీ ఒకేసారి కోల్పోవడంతో రోదనలు మిన్నంటాయి. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సదరం మరింత సులభం

- 21 రకాల కేటగిరీలను చేర్చిన కేంద్రం
- వచ్చే నెల నుంచి దరఖాస్తులు చేసుకునే అవకాశం



డొంకేశ్వర్(ఆర్మూర్): సదరం సేవలు మరింత సులభం కానున్నాయి. మీ సేవ కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకొని వేచిచూసే బాధలు దూరం కానున్నాయి. స్వయంగా దివ్యాంగులే దరఖాస్తు చేసుకునేలా కేంద్రం కొత్తగా యూనిక్ డిజెబిలిటీ ఐడీ (యూడీఐడీ) పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్‌లో సదరం సర్టిఫికెట్ లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర వివరాలతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంతకం, ఆధార్ లేదా మరేదైనా గుర్తింపు కార్డును అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం సదరం శిబిరం జరిగే స్థలాన్ని ఎంపిక చేసుకొని అప్లికేషన్‌ను సబ్మిట్ చేస్తే సరిపోతుంది. ఆ దరఖాస్తును అధికారులు పరిశీలించి సదరం క్యాంపునకు ఎప్పుడు హాజరు కావాలనే వివరాలను దరఖాస్తుదారుని సెల్‌ఫోన్‌కు పంపుతారు. శిబిరంలో సంబంధిత వైద్య నిపుణులు మెడికల్ రిపోర్టులను పరిశీలించి వైకల్యాన్ని నిర్ధారిస్తారు. కాగా, దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం కూడా పోర్టల్‌లో ఉంది. అయితే, పోర్టల్‌ను సిద్ధం చేసిన ప్రభుత్వం ప్రస్తుతం ట్రయల్ నిర్వహిస్తోంది. మార్చి నెల నుంచి పోర్టల్ అందుబాటులోకి రానున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు.

పెరిగిన సేవలు
ఇప్పటి వరకు మీ సేవ కేంద్రాల్లో సదరం స్లాట్ నమోదు చేసుకునేందుకు కేవలం ఐదు రకాల కేటగిరీల వారికే అవకాశం ఉండేది. ఇప్పుడు కేంద్రం కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌లో మొత్తం 21 రకాల కేటగిరీలను చేర్చింది. ఇందులో ప్రధానంగా తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

'స్మార్ట్'గా సదరం సర్టిఫికెట్
సదరం సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఏ4 సైజు పేపర్‌లో జారీ అయ్యేవి. ఇక మీదట స్మార్ట్ కార్డు రూపంలో ఇవ్వనున్నారు. కార్డుపై ఐడీ నెంబరుతోపాటు లబ్ధిదారుని ఫొటో, పేరు, వైకల్య రకం, వైకల్య శాతం వివరాలు ఉంటాయి. స్మార్ట్ కార్డును పోస్టుద్వారా ఇంటికే పంపుతారు. ఇప్పటికే సదరం సర్టిఫికెట్ ఉన్న వారికి కూడా స్మార్ట్ కార్డులను జారీ చేస్తున్నారు.

పంట విక్రయాలను పర్యవేక్షించాలి

- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- అధికారులు, వ్యాపారులతో సమీక్షలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ఎర్రజొన్న, తెల్లజొన్న, పసుపు పంటల క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పంట విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ట్రేడర్లు, విత్తన వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో సాగైన పంటల విస్తీర్ణం, దిగుబడులు, మార్కెట్‌లో డిమాండ్, పంటలకు లభిస్తున్న ధరలు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి తెల్లజొన్న, ఎర్రజొన్న కొనుగోళ్లు జరగాలని, రైతులు బయట మార్కెట్లో ఎక్కువ ధరకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సీడ్ వ్యాపారులకు సూచించారు. మార్చి 15 వరకు మార్కెట్‌కు జొన్న, పసుపు పంట దిగుబడులు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఇబ్బందులకు తావులేకుండా సాఫీగా క్రయవిక్రయాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డైరెక్ట్ పర్చేస్ సెంటర్ల ద్వారా రైతులు పసుపు విక్రయించడంతోపాటు వేగవంతంగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను మోసగిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగవ్వ, ఏడీఏలు, ఏవోలు, పసుపు ట్రేడర్లు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమానత్వంతోనే సామాజిక న్యాయం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి



ఇన్సూరెన్స్ కార్డులను అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

నిజామాబాద్‌నాగారం : సమానత్వంతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి పద్మావతి మాట్లాడుతూ కుల, మత, లింగ వివక్ష లేని సమాజం కోసం పాటుపడాలన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఆకుల విశాల్ మాట్లాడుతూ మానసిక దివ్యాంగ విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు అందించడం హర్షణీయమన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులతోపాటు నారాయణరెడ్డి, రమణారెడ్డి, తాటి వీరేశం, జీవన్ రావు, బాబా గౌడ్, విగ్నేష్ తదితరులను స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి సన్మానించారు. కార్యక్రమంలో మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బోధన్ పట్టణంలోని బీసీ బాలుర గురుకులంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

గురుకులంలో కలెక్టర్ బస

బోధన్: బోధన్‌లోని ఆజాంగంజ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఎడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం రాత్రి బస చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతి సదుపాయాలు, విద్యాబోధన, రోజువారీ దినచర్య, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ ఉన్న విద్యార్థుల తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ వారితో భేటీ అయ్యారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌లను పరిశీలించారు. పాఠశాల భవనంలో కలియతిరిగి తరగతి గదులు, కిచెన్ రూం, డైనింగ్ హాల్‌ను, స్టోర్ రూంలో నిల్వ ఉంచిన వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ పాఠశాలలో నిద్రించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్ ఉన్నారు.



బీసీ బాలుర గురుకులంలో విద్యార్థులతో కలిసి నిద్రపోతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్లుప్తంగా

నందిపేటలో పోలీసుల కవాతు



నందిపేట్(ఆర్మూర్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నందిపేట మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు కలిసి స్థానిక నాయకులతో శాంతిభద్రతల గురించి వివరించారు. సికింద్రాబాద్–హకీంపేట్ 99 బెటాలియన్ ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండర్ ఎస్‌హెచ్ వీరేంద్ర కేఆర్ యాదవ్, స్థానిక ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సికింద్రాబాద్–హకీంపేట్ 99 బెటాలియన్ ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండర్ ఎస్‌హెచ్ వీరేంద్ర కేఆర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలన్నా రు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు ఆర్మూర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కవాతు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, ఎస్సైలు గోవింద్,మహేష్, ఇంద్రకరణ్‌రెడ్డి,లక్ష్మణ్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎస్సై ఎల్ రామ్ గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయా లేవా అని వారు పరిశీలించారు. వారి వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సాంగ్లీ వైపు పసుపు రైతుల చూపు

■ మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన రైతు కల్లెం రవి తన 35 క్వింటాళ్ల పసుపు కొమ్ము, 11 క్వింటాళ్ల మండ పసుపును సాంగ్లీ మార్కెట్‌లో రెండు రోజుల క్రితం విక్రయించాడు. నిజామాబాద్ మార్కెట్‌లో ఉన్న ధరలతో పోల్చితే సదరు రైతుకు రూ.1,21,500ల ఆదాయం ఎక్కువగా సమకూరింది. దీంతో ఇతర రైతులు కూడా తమ పసుపు పంటను సాంగ్లీలోనే విక్రయించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గతంలో సాంగ్లీ, నిజామాబాద్ మార్కెట్‌ల మధ్య పసుపు ధరల్లో క్వింటాలుకు రూ.వెయ్యి మాత్రమే తేడా ఉండేది. దీంతో స్థానిక రైతులు నిజామాబాద్‌కే పంటను తీసుకొచ్చేవారు. ఈసారి మాత్రం ధరలలో ఎంతో వ్యత్యాసం ఉండటంతో స్థానిక రైతులు నిజామాబాద్‌లో కాకుండా సాంగ్లీ మార్కెట్‌లో పసుపు విక్రయించడానికి ఆసక్తి చూపుతున్నారు.



మార్కెట్‌కు తరలించడానికి రైతులు సిద్ధం చేసిన పసుపు

- నిజామాబాద్ మార్కెట్‌లో కంటే ఎక్కువ పలుకుతున్న ధర
- రవాణ ఖర్చు ఎక్కువైనా గిట్టుబాటు అవుతుందంటున్న అన్నదాతలు

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలోని పసుపు రైతులు తమ పంటను స్థానిక నిజామాబాద్ మార్కెట్‌లో విక్రయించకుండా, మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. దీనికి కారణం నిజామాబాద్ కంటే సాంగ్లీ మార్కెట్‌లో ఎక్కువ ధర పలకడమేనని తెలుస్తోంది. అలాగే నిజామాబాద్ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించి వేశారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

ఖర్చులు తక్కువే..

మన మార్కెట్‌కు పసుపు తరలిస్తే వచ్చే ఖర్చులతో పోల్చితే సాంగ్లీ మార్కెట్‌కు పంటను పంపిస్తే ఖర్చులు ఎక్కువగా ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ధర విషయానికి వస్తే సాంగ్లీ మార్కెట్‌లో కొమ్ముకు క్వింటాలుకు రూ.14వేలు, మండకు రూ.10వేల వరకు ధర లభిస్తుంది. ఇక్కడి మార్కెట్‌లో కొమ్ముకు రూ.11వేలు, మండకు రూ.8,500కు మించి ధర చెల్లించడం లేదు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపును తరలిస్తే ఒక్కో సంచికి రవాణా ఖర్చు రూ.60 అవుతుండగా సాంగ్లీకి రూ.160 రైతులపై భారం ఏర్పడుతుంది. ధర ఎక్కువగా ఉండటంతో ఈ ఖర్చులు సాధారణమే అని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కమీషన్ ఏజెంట్లకు రూ.లక్షకు రూ.2వేలను కమీషన్ రూపంలో చెల్లించాల్సి ఉంది. సాంగ్లీ మార్కెట్లో కమీషన్ ఏజంట్ల వ్యవస్థ లేకపోవడంతో రైతులకు కమీషన్ భారం తప్పినట్లు అయ్యింది.

బోర్డు ప్రారంభించినా దక్కని ధర..

పసుపు సాగు చేసే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రత్యేక బోర్డును నిజామాబాద్‌లోనే కొనసాగేలా ప్రారంభించింది. బోర్డు చైర్మన్ నియామకం పూర్తి కాగా విధివిధానాలను రూపొందించాల్సి ఉంది. పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన వెలువడటంతో ఈ పంటకు ధర ఎక్కువగా లభిస్తుందని రైతులు ఆశించారు. కానీ నిజామాబాద్ మార్కెట్‌లో మాత్రం ధర రూ.12వేలకు మించి ఎక్కువగా లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్డు ఏర్పాటు మాట ఎలా ఉన్నా మద్దతు ధర ప్రకటించాలని కనీసం ధర రూ.17 వేల వరకు ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

సాంగ్లీలోనే బాగుంది..



దొన్కల్, వన్నెల్(బీ), అంక్సాపూర్ రైతులు సాంగ్లీ మార్కెట్‌కు పసుపు పంటను తరలిస్తున్నారు. రెండు మూడు సంవత్సరాల పాటు నిజామాబాద్ మార్కెట్‌లోనే పసుపు విక్రయించాం. గతంలో ధరలో వ్యత్యాసం లేక పోవడంతో పొరుగు రాష్ట్రంకు పంటను తరలించలేదు. ఇప్పుడు ధర అక్కడ ఎక్కువగా లభిస్తుండటంతో ఎగుమతి చేస్తున్నాం.

– సంజీవరెడ్డి, రైతు, దొన్కల్

ధరలో ఎందుకు తేడా..



పసుపు పంట ఎక్కడైనా ఒక్కటే.. కానీ ధరలోనే ఎందుకు తేడా ఉంటుందో అర్థం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం పసుపు సాగును ప్రోత్సహించడానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసింది. ధర విషయంలో మాత్రం సరైన నిర్ణయం తీసుకోలేదు. సాంగ్లీలో ఒక విధంగా, నిజామాబాద్‌లో మరో విధమైన ధర ఎందుకు ఉందో అర్థం కావడం లేదు.

– గడ్డం లింగారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్

పసుపు రైతులను వేధిస్తే సహించం

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి
- నిజామాబాద్ ఏఎంసీ పరిశీలన

సుభాష్‌నగర్: పసుపు రైతులను వేధిస్తే సహించేదిలేదని, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు వారికి మేలు జరిగేలా చూడాలని జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డును గురువారం ఆయన సందర్శించారు. పసుపు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరనం పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. పచ్చి పసుపును మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని రైతులకు సూచించారు. యార్డుకు వచ్చే పసుపు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా రైతులకు లాభాపేక్షంగా నడుచుకోవాలని, పచ్చి పసుపును వ్యాపారులు కొనుగోలు చేస్తే మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పసుపు క్రయవిక్రయల గురించి తెలుసుకున్నారు. ఏఎంసీ సెక్రెటరీ అపర్ణ, డైరెక్టర్ మల్లేష్, వ్యాపారులు మాస్టర్ శంకర్, లాబిశెట్టి శ్రీనివాస్, దేవేందర్, తారక్ వేణుగోపాల్, తొగర నారాయణ, నాయకులు గంగోని గంగాధర్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్‌జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపికలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లా సబ్ జూనియర్ బేస్‌బాల్ బాలికలు, బాలుర జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామ శివారులోగల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో నేడు ఉదయం 9 గంటలకు బాలికల జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

అలాగే బాలుర జట్టు ఎంపిక పోటీలకు ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 2010 తర్వాత జన్మించి ఉండాలని, ఆసక్తి గలవారు జిల్లా కోచ్‌లు నరేష్, మౌనిక, జోత్స్నలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

అటెండర్‌కు డ్రైవింగ్ విధులు!

- తన సొంత కారుకు వాడుకుంటున్న నిజామాబాద్ రూరల్ ఏడీఏ

డొంకేశ్వర్(ఆర్మూర్): నిబంధనలు పాటించాలని చెప్పాల్సిన కొందరు అధికారులు అందుకు విరుద్ధంగా పనిచేస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఆఫీసుల్లో పని చేస్తున్న అటెండర్లను ఆఫీసు పనులకు మాత్రమే పరిమితం చేయాలి. కానీ గత కొంతకాలంగా రూరల్ కార్యాలయంలోని అంటెండర్‌ను ఏడీఏ తన సొంత పనులకు కారు డ్రైవర్‌గా వినియోగిస్తున్నట్లు తెలిసింది. అటెండర్‌కు ప్రభుత్వం నుంచి జీతం వస్తుండగా, ఏడీఏ తన సొంతకారుకు డ్రైవర్‌గా పని చేయించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. కాగా, వ్యవసాయ శాఖలోనే ఏవోగా పని చేస్తున్న ఆయన సతీమణి కూడా రూరల్ ఆఫీస్ అటెండర్‌ను డ్రైవర్‌గా వినియోగించుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవల బోధన్‌లో జరిగిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి అటెండరే కారులో తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్‌ను 'సాక్షి' వివరణ కోరింది. ఆఫీస్ అటెండర్‌ను సొంతకారుకు డ్రైవర్‌గా పని చేయించుకోవడం నిబంధనలకు విరుద్ధమని, దీనిపై విచారణ జరుపుతామని తెలిపారు.



ఏడీఏ కారును బోధన్‌కు తీసుకువచ్చిన అటెండర్

క్రైం కార్నర్



ప్రమాదానికి కారణమైన కారు

కామారెడ్డి క్రైం: అదుపు తప్పిన కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని గోదాం రోడ్డులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా. కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామానికి చెందిన రేకులపల్లి యశోద (68) అనే వృద్ధురాలు వ్యక్తిగత పనుల మీద కామారెడ్డికి వచ్చి, ఇంటికి తిరిగి వెళ్లేందుకు గోదాం రోడ్డులో ఉన్న ఎఫ్‌సీఐ గోదాం వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉంది. అదే సమయంలో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఓ కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన కారు మొదట వృద్ధురాలిని ఢీకొని ఆపై పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని సైతం ఢీకొంది. స్తంభానికి, కారుకు మధ్య వృద్ధురాలు చిక్కుకోవడంతో స్థానికులు గమనించి, వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతురాలి కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.



యశోద మృతదేహం

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు, సంపులో పడి ఒకరు, చేపలవేటకు వెళ్లి ఒకరు మృత్యువాతపడ్డారు.

రెండు బైక్‌లు ఢీకొని..

బోధన్‌రూరల్: మండలంలోని చిన్నమావంది బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. చిన్నమావంది గ్రామానికి చెందిన గంగొండ (64) బుధవారం రాత్రి పెగడపల్లి వెళ్లి తన బైక్‌పై గ్రామానికి తిరిగివస్తున్నాడు. అదే సమయంలో కల్దుర్కి గ్రామానికి చెందిన ఉమాకాంత్, తన చిన్నమ్మతో కలిసి పెగడపల్లి వైపు వెళ్తుండగా చిన్నమావంది బ్రిడ్జి వద్ద గంగొండ వాహనాన్ని ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగొండ అక్కడిక్కడే మృతిచెందగా ఉమాకాంత్, అతని చిన్నమ్మ శోభ గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గంగొండ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై మచ్చేందర్‌రెడ్డి గురువారం తెలిపారు.

సంపులో పడి గుర్తు తెలియని మహిళ..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కమలా నేహ్రూ కాలనీ బృందాన్ టాకీస్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనం సంపులో పడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో వాచ్‌మెన్ లేకపోవడంతో బుధవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని మహిళ భవనం లోపల నిద్రించింది. ఒక్కసారిగా ఆమెకు ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న సంపుపడి మృతిచెందింది. మృతురాలి వయస్సు సుమారు 40ఏళ్లు ఉంటాయని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో తరలించామని పోలీసులు తెలిపారు. మృతురాలి సంబంధికులు ఎవరైన ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడు..



నడ్పి రాజన్న మృతదేహం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన బట్టు నడ్పిరాజన్న (52) రోజు మాదిరిగా బుధవారం రాత్రి ఎస్సారెస్పీలోకి చేపలవేటకు వెళ్లాడు. రాత్రి భోజన సమయానికి గట్టుకు రాకపోవడంతో తోటి మత్స్యకారులు అనుమానంతో గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం అతడి మృత దేహం లభ్యమైంది. కాళ్లకు వల చుట్టుకుని ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



సొప్పరి మాణిక్యం(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుర్జాల్ గ్రామానికి చెందిన ఓ రైతు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిని వివరాలు ఇలా.. గుర్జాల్ గ్రామానికి చెందిన సొప్పరి మాణిక్యం(40) అనే రైతు తనకున్న పొలంలో రెండు బోర్లు వేయగా విఫలం అయ్యాయి. కొన్ని రోజులు బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. అయినా చేసిన అప్పులు తీరక, తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన మాణిక్యం అక్కడే పురుగుల మందు తాగి తూలుతు ఇంటికి వచ్చాడు. గమనించిన ఆయన కుమారులు, భార్య చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరు..

మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. బోర్గాం(కె) గ్రామానికి చెందిన రెంజర్ల లస్మన్న (57)కు మూడేళ్ల క్రితం గుండె ఆపరేషన్ అయింది. అప్పటి నుంచి వ్యాధికి సంబంధించిన మందులు వాడుతునే ఉన్నాడు. మరిన్ని వ్యాధులకు గురికావడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి సమీపంలో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కామారెడ్డిలో మరొకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం వెలుగుచూసింది. వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే పసుపునూరి నాగయ్య (30) స్థానికంగా ఓ మొబైల్ షాప్‌లో పని చేసేవాడు. అతడికి నాలుగేళ్ల క్రితం రమ్యతో వివాహం జరుగగా, వారికి ఇద్దరు పిల్లలున్నారు. నాగయ్య ఇటీవల మద్యానికి బానిస కాగా, దంపతుల మధ్య తరచు గొడవలు జరిగేవి. బుధవారం రాత్రి కూడా గొడవలు జరుగగా భార్య వేరే గదిలో పడుకుంది. నాగయ్య మరో గదిలో పడుకోగా ఉదయం చూసేసరికి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పేకాడుతున్న పదిమంది అరెస్టు

ఖలీల్‌వాడి: నవీపేట మండల పరిధిలోని యంచ గ్రామ శివారులో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు యంచ గ్రామ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేయగా పది మంది పేకాడుతూ పట్టుబడ్డారన్నారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లు, 11 బైక్‌లు, రూ.47,720 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి చర్య నిమిత్తం నవీపేట్ పీఎస్ ఎస్సైకు అప్పగించినట్లు తెలిపారు.

బోధన్‌లో ఆరుగురు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని ఆటోనగర్ కాలనీలో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 6బైక్‌లు, 5 సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామన్నారు.

ఇంట్లోకి వెళ్లి బంగారం అపహరణ

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి)లోగల ఓ ఇంట్లోకి గుర్తుతెలియని దుండగుడు వెళ్లి, మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం బైక్‌పై వచ్చిన దుండగుడు ఇంట్లోకి వెళ్లి సుంకరి కళావతి అనే మహిళ మెడలో నుంచి తొమ్మిది మాసాల బంగారం ఎత్తుకెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొనడంతో విద్యార్థులకు గాయాలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం తిప్పారం రోడ్డులోని ఎస్టీ హాస్టల్ వద్ద గురువారం సాయంత్రం ఇద్దరు విద్యార్థులను ట్రాలీ ఆటో (టాటా ఏస్) వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలానికి చెందిన ఇద్దరు చిన్నారులు అర్జున్–4వతరగతి, సాయికల్యాణ్–3వ తరగతి (అన్నదమ్ములు) హాస్టల్ బయట ఉండగా, మండల కేంద్రంలోని ఓ వాటర్ ప్లాంటుకు చెందిన టాటా ఏస్ వాహనం నీటిక్యాన్‌లతో తిప్పారం వైపు వెళ్తుండగా వారిని ఢీకొట్టింది. ఈఘటనలో కల్యాణ తలకు బలమైన గాయాలు కాగా, అర్జున్ కాలు విరిగింది. క్షతగాత్రులను 108 అంబులెన్సులో కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. హాస్టల్ పీఈటీ ఫిర్యాదు మేరకు వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ అస్లామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

కామారెడ్డి క్రైం: ప్రమాదం విషయంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. వివరాలు తెలుసుకున్న ఆయన జరిగిన ఘటనపై ఆరా తీశారు. గాయపడిన ఇద్దరు విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వారిని నిజామాబాద్ జనరల్ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని డీపీఆర్‌వో భీంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొని..



ఇందల్వాయి: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై గన్నారం గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందల్వాయి టోల్‌ప్లాజా సిబ్బందికి గాయాలయ్యాయి. పెట్రోలింగ్ వాహనంలో టోల్‌ప్లాజా సిబ్బంది ఒకరు రోడ్డు నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న సమయంలో, కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు స్టీల్ లోడ్‌తో వేగంగా వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెట్రోలింగ్ వాహన డ్రైవర్ వడ్ల బ్రహ్మం గాయపడ్డాడు. వెంటనే అతడిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

తీసుకున్న అప్పు చెల్లించాలన్నందుకే హత్య

- నాగేంద్రనగర్ ఆశావర్కర్ మర్డర్ మిస్టరీని ఛేదించిన పోలీసులు
- నిందితుడి పట్టివేత



కొండ లక్ష్మి(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌కు చెందిన ఆశావర్కర్ కొండ లక్ష్మి(45) జనవరి 21న అదృశ్యమై, చివరకు హత్యకు గురైన విషయం విదితమే. ఈఘటనలో నిందితుడిని బుధవారం పోలీసుల అరెస్టు చేశారు. ఈక్రమంలో హత్యకు సంబంధించి 'సాక్షి' సేకరించిన సమాచారంలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్‌కు చెందిన కుంచపు వెంకటేష్ కూలీ పని చేయడానికి గతంలో నాగేంద్రనగర్‌కు వచ్చాడు. ఈక్రమంలో ఒంటరిగా ఉంటున్న లక్ష్మితో పరిచయం పెంచుకుని ఆమె ఇంటిలో కూలీ పని చేసేవాడు. ఆమెను నమ్మించి కొంత నగదును చేబదులుగా తీసుకున్నాడు. ఆమె ఇచ్చిన సొమ్మును తిరిగివ్వాలని అడగడంతో కోపం పెంచుకున్న వెంకటేష్ ఫోన్ చేసి పొన్కల్‌కు వస్తే డబ్బులు ఇస్తానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన లక్ష్మి పొన్కల్ వెళ్లగా మాయమాటలు చెప్పి, దట్టమైన అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అనంతరం ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసును తీసుకున్నాడు. హత్య చేసి మృతదేహాన్ని ఎవరికి కనపడకుండా చెట్టు చాటున ఉంచి గ్రామానికి చేరుకున్నాడు. ఏమీ ఎరుగనట్లు నిజామాబాద్, నిర్మల్ మార్కెట్‌లలో ఉల్లిగడ్డలు అమ్ముతున్నాడు. తనకు ఆరోగ్యం బాగలేదని ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు పత్రాలను సైతం సృష్టించాడు. కానీ మృతురాలు లక్ష్మి, నిందితుడు వెంకటేష్ ఫోన్‌లు ఒకే సమయంలో ఒకేచోట స్విచ్‌ఆఫ్ కావడంతో వెంకటేష్ కుట్ర కోణంపై పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారించారు. దీంతో ఆమెను ఇంటి వద్ద నుంచి వచ్చిన రోజునే హత్య చేసి, శవంను అటవీ ప్రాంతంలో దాచి ఉంచినట్లు నిందితుడు అంగీకరించాడు. మృతదేహాన్ని దాచిన ప్రాంతానికి పోలీసులను తీసుకువెళ్లి చూయించాడు. అందరితో కలుపుగోలుగా ఉండే లక్ష్మి హత్యకు గురికావడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.


ఇసుక టిప్పర్ పట్టివేత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు నవీపేట్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. మల్కాపూర్ గ్రామంలో టీఎస్16యుఏ2283 నెంబర్‌గల టిప్పర్ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. టిప్పర్, డ్రైవర్‌ను తదుపరి చర్య నిమిత్తం నవీపేట్ పీఎస్ ఎస్సైకు అప్పగించినట్లు చెప్పారు. అలాగే నగరంలోని సారంగాపూర్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌పై గురువారం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. కానీ ఎస్సై అందుబాటులో లేరని, పోలీసులు పట్టించుకోలేదని డయల్ 100కు సమాచారం అందించారు. దాంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెంటనే వచ్చి ఇసుక టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కొత్తపేటలో దారిదోపిడీ

నిజామాబాద్ రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో బీహార్‌కు చెందిన పలువురు హమాలీలు దారిదోపిడీకి పాల్పడారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన జితేష్ బుధవారం ఉదయం నిజామాబాద్‌కు శుభకార్యం నిమిత్తం వెళ్లగా, అర్ధరాత్రి తిరిగి సొంతూరికి బయలుదేరాడు. రూరల్ మండలం కొత్తపేట గ్రామ శివారులోని నిజాంసాగర్ కెనాల్ వద్ద అతడిని స్థానికంగా ఉన్న రైస్‌మిల్‌లో పనిచేస్తున్న హమాలీలు అడ్డుకొని కర్రలతో కొట్టి, చేతిపై తీవ్రగాయాలు చేశారు. అనంతరం అతడి వద్ద ఉన్న రూ.1000 నగదు, సెల్‌ఫోన్ దొంగిలించారు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.

అటవీ ప్రాంతంలో మంటలు



నాగిరెడ్డిపేట: తాండూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఫారెస్ట్ అధికారులు పెంచుతున్న నీలగిరి చెట్లు కొంతమేర దెబ్బతిన్నాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న డీఎఫ్ఆర్వో రవికుమార్, బీట్ అధికారి నవీన్ ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. చెలరేగిన మంటలను ఆర్పివేశారు. కాగా మండలంలోని బంజర సమీపంలో గల అటవీ ప్రాంతంలోనూ బుధవారం రాత్రి మంటలు చెలరేగడంతో ఫారెస్ట్ అధికారులు అక్కడికి వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇటీవల మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలోనూ మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. మండలంలో జరుగుతున్న వరుస ఘటనలతో ఫారెస్ట్ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒకరోజు జైలు

బోధన్‌టౌన్(బోధన్): మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతుండగా, పోలీసుల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలు శిక్షను విధించాడని సీఐ తెలిపారు.